మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
ఆదివారం | 16 | జూలై | 2023 | పేజీలు : 9




## బిసి కులవృత్తులకు జీవం పోసేందుకే

# ఆర్థిక సహాయం

### మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ బ్యూరో, జులై 15 (మనం న్యూస్)ః కుల వృత్తులకు జీవం పోసేందుకే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతి కుటుంబానికి లక్ష సాయం అందజేస్తున్నట్లు బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో 32 మంది కులవృత్తులకు లక్ష రూపాయల చొప్పున విలువ చేసే ఆర్థిక సహాయ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కులవృత్తి చేసుకునే ప్రతి బిసి కుటుంబం ఆత్మగౌరవంతో బతకాలన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చే రుణాలకు బ్యాంకు గ్యారంటీలు అడిగేవారని, తెలంగాణ ప్రభుత్వం అందజేసే లక్ష సాయానికి ఎలాంటి బ్యాంకు గ్యారంటీ లేకుండా అందజేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలో ప్రతి బిసి కులానికి హైదరాబాద్ నడిబొడ్డున కోకాపేట లో విలువైన భూమిని కేటాయించారని తెలిపారు. చేతి కుల వృత్తులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రతి కుటుంబానికి లక్ష సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని గంగుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపిపి తిప్పర్తి లక్ష్మయ్య, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఇప్పుడు

# మహోద్యమం

### గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఇప్పుడు మహోద్యమం

### రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్

జగిత్యాల, ప్రతినిధి, జులై 15 (మనం న్యూస్): మూడు మొక్కలతో ప్రారంభమైన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం, ప్రజల భాగస్వామ్యంతో ఐదేళ్లలో మహా ఉద్యమంగా మారిందని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం కొడిమ్యాల రిజర్వ్ ఫారెస్ట్ లో మంత్రులు ఇంద్ర కరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, స్థానిక శాసన సభ్యులు సుంకే రవి శంకర్ లతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలి దశలో కొడిమ్యాల రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో మొత్తం 1,094 ఎకరాల అటవీ భూమిని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా దత్తత తీసు కొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మీడియాతో మాట్లాడుతూ గ్రీన్ ఇండి యా ఛాలెంజ్ మొదలై ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకుని ఆరో సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఆరవ విడతలో పచ్చదనం పెంపు, ప్లాస్టిక్ కాలుష్యం, నియంత్రణ, అవగాహనపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా తెలంగాణ తో పాటు దేశ వ్యాప్తంగా సంవత్సరాల కాలంలో లక్షలాది మొక్కలను నాటి, వాటిని సంరక్షించామన్నారు. మొక్కలకు నాటుతూ పచ్చదనం ను పెంచుతున్న ప్రకృతి ప్రేమికులు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి మాట్లాడుతూ కొండగట్టు అంజనేయ క్షేత్రం అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అభివృద్ధి మిగతా 2లో..



## గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు

# అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

### టి.ఎస్.పి.ఎస్.సి. చైర్మన్ జనార్ధన్ రెడ్డి



మంచిర్యాల ,జూలై 15( మనం న్యూస్): ఆగస్టు 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షల నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉ ండాలని టి.ఎస్.పి.ఎస్.సి. చైర్మన్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.ఎస్.పి.ఎస్.సి. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 29, 30 తేదీలలో ఉదయం, మధ్యాహ్నం వేళలలో గ్రూప్-2 సర్వీసెస్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య- ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో టి.ఎస్.ఆర్.టి.సి. ఆధ్వర్యంలో బస్సులు నడిపించాలని, పరీక్ష కేంద్రాలలో మిగతా 2లో..

# ఆల్ఫోర్స్‌లో అంగరంగ వైభవంగా బోనాల సంబరాలు

**- పురాతన సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాల జాతర**

**- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి**

సుల్తానాబాద్,జూలై 15 మనం న్యూస్ : పురాతన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే బోనాల జాతరను శనివారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో పాటు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి బోనంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పండుగలకు నిలయమని పండుగల యొక్క విశిష్టతను కాపాటంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ముందుంటాయన్నారు. మన పురాతన పండుగలను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. డిజిటల్ యోగంలో పండుగలకు ఇస్తున్న ప్రాముఖ్యత తగ్గిపోతుందని మన పండుగల ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకే విద్యార్థులకు పాఠశాలలోనే పండుగలను వారిచేత నిర్వహింపజేసి భవిష్యత్తు తరాలకు బాసటగా నిలుస్తున్నామన్నారు. మహిళలకు ప్రీతికరమైన పండుగ బోనాల పండుగ అని బోనం నెత్తిన ఎత్తుకో






వడం ద్వారా వారి ఇళ్లల్లో సుఖసంతోషాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగకు అత్యంత ప్రాధన్యత నిస్తుందన్న బోనాల సమర్పణ అనంతరం అత్యంత కీలక ఘట్టమైన భవిష్యవాన్ని కార్యక్రమాన్ని ప్రజలందరూ ఆసక్తితో ఉత్కంఠతో ఎదురు చూస్తారని ఆషాడ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి శాంతింపజేసి ఆశీర్వాదం పొందుతారని విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో మన విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వారిలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించింది.పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం విద్యార్థులు పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. అలాగే పాఠశాలలో నిర్వహించిన హౌస్ ఎలక్షన్స్‌లో గెలుపొందిన క్యాప్టెన్ వైస్కాప్టర్లకు బ్యాడ్జీలను ధరింపజేశారు. వారిచేత ప్రమాదం స్వీకారం చేయించారు. అంతకుముందు వారిచే గౌరవనీ స్వీకరించా రు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకు బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి



ముత్తారం,జూలై 15 మనం న్యూస్ : మండలంలోని సీతంపేట గ్రామంలో గ్రామదేవత పోచమ్మ విగ్రహం ప్రతిష్టాపన చేసిన 41రోజులు పూర్తయిన సందర్భంగా మంథని నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మడిపోజు వెంకట్రాజం,తోట నాగరాజు,సుధీర్,అజయ్,వినయ్,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.


## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఇప్పుడు మహోద్యమం

మొదటి పేజీ తరువాయి..

కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. అటవీ, దేవాలయాల ప్రేమికులుగా సంతోష్ కుమార్ సిఎం కు తోడ్పాటుగా కోటి 4 లక్షల రూపాయలతో కొండగట్టు అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుండడంతో ఈ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కొండగట్టు క్షేత్రం నుంచి 100 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు సరిపడా ఆక్సిజన్ అందుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో 265 కోట్ల మొక్కలను ఇప్పటి వరకూ నాటినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గ బిడ్డగా ఎంపి సంతోష్ కుమార్ ఈ నియోజకవర్గ పరిధిలోని కొండగట్టు ఆధ్యాత్మిక క్షేత్రాన్ని దత్తత తీసుకొని అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. అంతకుముందు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని జోగినపల్లి సంతోష్ రావు, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్, జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, సంజయ్ కుమార్ లతో కలిసి దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎం కార్యదర్శి భూపాల్ రెడ్డి, హరిత హారం ప్రత్యేక అధికారి ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి..



పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో 17 వేల 136 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఆగస్టు 29, 30 తేదీలలో జరుగనున్న గ్రూప్-2 పరీక్ష నిర్వహణ కొరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ తహశిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్పాండే, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు రాకేష్**



కరీంనగర్ కలెక్టరేట్, జులై 15 (మనం న్యూస్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు భారీ ఎత్తున విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేష్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంగా ఉన్న శాతవాహన యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించక, ఉన్నటువంటి రెగ్యులర్ కోర్సులను పూర్తిగా మార్చి పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రపూరిత చర్యను యూనివర్సిటీ అధికారులు చేస్తున్నారన్నారు. నకిలీ పత్రాలతో అధికారులు, ఇతర సిబ్బంది చలామణి అవుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని హాస్టళ్లకు పక్కా భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నా స్థానిక మంత్రి గంగుల కమలాకర్ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎబివిసి నగర కార్యదర్శి విష్ణు, జోనల్ ఇంఛార్జీలు నందు, శ్రీవర్ధన్, కార్యకర్తలు సంహిత్, సాయి కృష్ణ, ప్రదీప్, రేవంత్, పవన్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటి డైరక్టర్ ఆదేశాల మేరకు 24 గంటల లోపు క్యాంప్‌లో కార్మికుల కొరకు ఆటవిడుపు,వినోదపు సదుపాయలు

**స్పందించి ఆదేశాలు జారీ చేసిన ఆర్జీ-3 జియం**

**కీలక పాత్ర పోషించిన ఓసిపి-2 పిఓ**



రామగిరి,జూలై 15 మనం న్యూస్ : బుధవారం రోజున ఆర్జీ-3,ఏపిఏ ఏరియా 18వ రక్షణ త్రైక్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్ సేఫ్టీ భూషన్ ప్రసాద్ సింగ్ పాల్గొన్నారు.ఏరియాలోని అన్ని ఆఫ్ లోడింగ్ కంపెనీ యజామాన్యాలకు వారి కంపెనీలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు,రిక్రియేషన్ సదుపాయాలు కల్పించవలసిందిగా ఆదేషించడమైనది. వెంటనే స్పందించిన జనరల్ మేనేజర్ ఆర్జీ-3 ఎన్,సుధాకర్‌రావు వెంటనే సంబంధిత కాంట్రక్టర్స్ కి 2 రోజులలో వారి ఉద్యోగులకి రిక్రియేషన్ సదుపాయాలు కల్పించవాల్సిందిగా తెలియపరిచారు. వారి ఆదేశాలనుసారం ఆర్జీ-3 ఓసిపి-2 లోపి సి-5 ఈపిఎల్ కాంట్రాక్ట్ కంపెనీ ఆఫ్ లోడింగ్ క్యాంప్ లో కార్మికుల కొరకు అటవిడుపు,వినోదపు సదుపాయాలు,టెలివిజన్ (టివి)పేపర్,క్యారమ్స్,చెస్,వాలీబాల్,బాడ్మింటన్,కోర్ట్,వాటి కి సంబంధించిన ఇన్ స్టాక్చర్ ఆర్జీ ఓసిపి-2 పిఓ కే.రాజేందర్ 24 గంటల లోపల ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోశించడం జరిగింది. ఈ ఏర్పాట్లను ఓసి-2 గని మేనేజర్ కె.వి రామరావ్,ఆఫ్ లోడింగ్ ఇంచార్జ్ రాజేష్,గని సంక్షేమ అధికారి బండరీ మురళీ పరిశీలించడం జరిగింది. ఈ సదుపాయలు కల్పించినందుకు గాను ఆఫ్ లోడింగ్ కార్మికులు సంతోషం వ్యక్తం చేయండం జరిగింది.

# అల్ఫోర్స్‌లో ఘనంగా బంగారు బోనం ఉత్సవ్



కరీంనగర్, జులై 15 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్‌లో శనివారం బంగారు బోనం ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశక్తి స్వరూపినికి పూజా కైంకర్యాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగతో సుఖసంతోషాలు వెదజల్లుతాయని, ప్రకృతి ఒడిని గొప్పగా అనుభవించిన వారమవుతామన్నారు. బోనాలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకత ఉందని, నెల రోజుల పాటు బోనాల పండుగను రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సామూహికంగా జరుపుకుంటారని తెలిపారు. ఆషాడ మాసం బోనాలకు చాలా విశిష్టమైనదని, వివిధ కులస్తుల వారు బోనాలను వేడుకగా కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించి అమ్మవారి యొక్క కృపా కటాక్షములను పొందుతారని చెప్పారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన అమ్మా వందనం అమ్మా, ఊరు బైలెల్లినాదే.. పట్నం బైలెల్లినాదే.. బోనం సమర్పించడానికి పేరిట ప్రదర్శించిన నృత్యాలు చాలా ఆకర్షించింపజేశాయి. ఈ సందర్భంగా సుమారు 50 మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి బోనాలను ఎత్తుకొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ప్రత్యేకంగా 30 మంది పోతురాజుల వేశధారణలో విచ్చేసిన చిన్నారులు చేసిన విన్యాసాలు చాలా అబ్బురపరచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టేబుల్ టెన్నిస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించిన సిపి సుబ్బారాయుడు



కరీంనగర్, జులై 15 (మనం న్యూస్)ఃనగరంలోని జిఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న టేబుల్ టెన్నిస్ పోటీల పోస్టర్‌ను శనివారం జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి ఎల్.సుబ్బారాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజర్ సురేందర్, డైరెక్టర్ గౌతమ్, కో-ఆర్డినేటర్ వికాస్‌లు మాట్లాడుతూ జిఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలు అండర్-13, అండర్-16, అండర్-19 సింగిల్స్, డబుల్స్ బాలురు, బాలికల విభాగంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు 25 వేల రూపాయల నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు పాల్గొనేవారు ఈనెల 21 వ తేదీలోపు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లైక్ ఆర్ ఎస్ ఐ ఏ సురేష్ , డాక్టర్ శరత్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనుప్ కుమార్, డి వెంకటేశ్వరరావు ,రాఘవేంద్ర హాస్పిటల్ వారి సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఎంట్రీ ఫీజు సింగిల్స్ 300, డబుల్ 500. వివరాలకు 8125669935, 9949473763 సంప్రదించగలరని తెలిపారు.

## 19 ఏళ్ల లోపు ఉన్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

### అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



రాజన్న సిరిసిల్ల, జులై 15, (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎ సుమన్ మోహన్ రావుల సమక్షంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవము, ఇంటెన్సిఫైడ్ మిషన్, ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జులై 20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవము కొరకు జిల్లాలో ఉన్న ప్రతి అంగన్వాడీ కేంద్రము, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, విధిగా తల్లిదండ్రులకు, పిల్లలకు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. 1-19 ఏళ్ల పిల్లల అందరికీ విధిగా అల్బెండజోల్ మాత్రలను వేయించాలని సూచించారు.ఈ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటి కార్యక్రమములో డీపీవో రవీందర్, డిడబ్ల్యుఓ లక్ష్మీరాజం, డీపీవో, డీఐఈవో డా.శ్రీరాములు ప్రోగ్రాం అధికారి డా. నయీమా, సిరిసిల్ల, వేములవాడ మునిసిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్ పాల్గొన్నారు.





## వినతి పత్రం అందజేత

తిమ్మాపూర్, జులై15(మనం న్యూస్): జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితం పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజ లింగం, దామోదర్ రెడ్డి ల పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ లో పడాల ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యములో జనసేన పార్టీ కార్యకర్తలతో కలసి వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో బండిపల్లి మారుతి, గొల్లపెల్లి హరీష్ గౌడ్, వినయ్ కుమార్ తో పాటు తదితరులు, పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



బోధన్, జులై 15, (మనం న్యూస్)ః బోధన్‌లో ఈ నెల 19న నిర్వహించనున్న ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను అయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ అయేషా ఫాతిమా, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్‌లు స్థానిక కౌన్సిలర్లతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తిలో ప్రావీణ్యం పొందిన వైద్యులు పాల్గొననున్న ఈ మెగా హెల్త్ క్యాంపును పట్టణంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్లు అబ్దుల్లా, పౌల్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం కో కన్వీనర్ గా కలికోట మోహన్



కొత్తపల్లి,జులై15( మనం న్యూస్): విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కో-కన్వీనర్‌గా కళికోట మోహన్ ఎన్నికయ్యారు. శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం కరీంనగర్ కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్వీనర్ శ్రీరామోజు రవీంద్రాచారి అద్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలికోట మోహన్ మాట్లాడుతూ సంఘం యొక్క నిబంధనలకు లోబడి సంఘ బలోపేతానికి తద్వార విశ్వబ్రాహ్మణుల అబివృద్ధికి పాటుపడ తానని నా పట్ల నమ్మకంతో నన్ను ఎన్నుకున్న కుల పెద్దలకు మరియు సంఘం కమిటీ పెద్దలకు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో.. విద్యార్థి ఎన్నికల ప్రమాణోత్సవం



కరీంనగర్, జులై 15 (మనం న్యూస్)ః నగరంలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో శనివారం ఎన్నికల ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథిదులుగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సోషల్ వెల్ఫేర్ నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి స్థాయిలోని నాయకత్వలక్షణాలను, నైతిక విలువలను పెంపొందించుకోవాలని తెలిపారు. నాగార్జున మాట్లాడుతూ పాఠశాల నియమ నిబంధనలు విద్యార్థులు పాటించాలని, మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. రామకృష్ణపరమ హంస, అబ్దుల్ కలాం లాంటి వారిని స్ఫూర్తిదాయకంగా తీసుకుని ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ఎన్నికల్లో గెలు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన అభినందించారు.

## భగత్ నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



కరీంనగర్, జులై 15 (మనం న్యూస్)ః నగరంలోని గౌతమి నగర్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు భగత్ నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా నోట్ బుక్స్ ,గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భగత్ నగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెన్నం రాజిరెడ్డి , సెక్రటరీ సిరిపురం ప్రసాద్, ట్రెజరర్ డాక్టర్ బి.రత్నం, జిల్లా బాధ్యులు రవీందర్, పెర్మారావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి , సభ్యులు రామస్వామి , మింగని వెంకన్న, మల్లేశం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సిబ్బందిపై కక్ష సాధింపు సిగ్గుచేటు




**పారిశుద్ధ్య కార్మికులను చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం**

**పారిశుద్ధ్య కార్మికులకు సంఘీభావం**

**జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడూరి శ్రీమాన్**

పెద్దపల్లి, జులై 15(మనం ప్రతినిధి): ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను చిన్నచూపు చూస్తుందని, పారిశుద్ధ్య కార్మికులపై కక్ష సాధింపు సిగ్గుచేటని జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడూరి శ్రీమాన్ ఆరోపించారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద గత పదిరో జులుగా సమ్మె చేస్తున్న గ్రామ పారిశుద్ధ్య కార్మికుల దీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి వజ్రాసనంలో ఉండి గ్రామపంచాయతి కార్మికులకు, కారో బార్లకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా లలో గత పదిరోజులుగా పంచాయతీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తూ ఉండడంతో వ్యర్థపదార్థాలు, చెత్తా చెదారం పేరుకుపోయి గ్రామాలలో దుర్గంధం వ్యాపిస్తుంటే ఈప్రభుత్వానికి కనీసం సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించయపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గ్రామాలలోని టీఆర్ఎస్ సర్పంచులందరూ పారి శుద్ధ్య కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు.

మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి జీవో నం.60ప్రకారం వేతనాలు చెల్లించాలని శ్రీమాన్ డిమాండ్ చేశారు. రెండు లక్షల కోట్ల గల బడ్జెట్‌లో పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మల్టీ పర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పిఆర్‌సిలో నిర్ణయించిన విధంగా కనీస వేతనాలు 19వేల రూపాయలు చెల్లించాలని, జీవో నంబర్ 51ని సవరించాలని అన్నారు. కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద భీమా గ్రావిటీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించండి



సుల్తానాబాద్,జూలై 15 మనం న్యూస్ : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని ఆదరించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే,టిపిసిసి ఉపాధ్యక్షులు, చింతకుంట విజయరమణారావు అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ పార్టీ- పల్లె పల్లెకు విజ్జన్న అనే నినాదంతో శనివారం సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో విజయరమణారావు పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ప్రజా సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు,హామీలు 5 వందల రూపాయలకే గ్యాస్,రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణ మాఫీ,ఇల్లు ఇల్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షల రూపాయలు అందజేయడం,మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కలిపిస్తామని అన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు నెలకు 4 వేల రూపాయల నిరుద్యోగల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో ఎంపిటిసి మండల రమేష్,కాంగ్రెస్ నాయకులు కుమార్ కిషోర్,చిలుక సతీష్,మేకల పోచాలు,నోముల శ్రీనివాస్‌రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు తక్షణమే ఇళ్ల స్థలాలు అందించాలి

**కాంగ్రెస్ లీగల్ సెల్**




కరీంనగర్ లీగల్, జులై 15 (మనం న్యూస్): న్యాయవాదులకు వెంటనే ఇళ్ల స్థలాలు అందించాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కోర్టు పరిధిలోని జ్యోతినగర్‌లో ముఖ్య న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోర్టులో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు లీగల్ సెల్ ఏ విధంగా అండగా ఉండాలనే అంశాలపై చర్చించారు. ఇటీవల న్యాయవాదులకు ఇండ్ల స్థలాల పట్టాలు ప్రభుత్వపరంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి గంగుల కమలాకర్ వెంటనే ఈ విషయంపై అధికారులతో మాట్లాడి ఇండ్ల స్థలాలు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు, న్యాయవాదులకు సంపూర్ణ మద్దతు ప్రకటించి వారికి జరిగే అన్యాయాలను ఎండగడుతామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు లీగల్ సెల్ బాధ్యులు దేవేందర్ రెడ్డి, కల్లేపల్లి లక్ష్మయ్య, కిసాన్ సెల్ మాజీ అధ్యక్షులు రాజేశం, పెంచాల లక్ష్మణ్ రావు, రాచకొండ ప్రభాకర్,రమణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వీరబోయిన కుమార్ యాదవ్, జిల్లా అధికారప్రతినిధి కొత్తకొండ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లూరి కృష్ణ, ఛిజి ప్రదీప్ కుమార్ రాజు, పంజాల కుమారస్వామి,గంగుల దిలీప్ కుమార్, పింగిలి రమేష్ రామాచారి, లింగంపల్లి శ్రీకాంత్,అబ్దుల్ నవాజ్, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించని తెలంగాణ ప్రభుత్వం

రామగిరి,జూలై 11 మనం న్యూస్ : రామగిరి మండలంలో గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన రామగిరి మండల బిజేపి శాఖ,బిజెపి నాయకులు మోలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఏర్పడితే కాంట్రాక్టు ఉద్యోగులు ఉండరని మాటిచ్చిన కేసీఆర్ రాష్ట్రం ఏర్పడ్డాక పారిశుధ్ధ్య కార్మికులను మర్చిపోయారని మున్సిపల్ కార్మికులకు ఓ న్యాయం పరిశుధ్ధ్య కార్మికులకు ఓ న్యాయమా అని అన్నారు. దేశవ్యాప్తంగా కరోనా వచ్చినప్పుడు కీలకపాత్ర పోషించింది.పారిశుధ్ధ్య కార్మికులే అని అన్నారు. మరణానికి భయపడకుండా గ్రామ పరిశుభ్రతతే మన పరిశుభ్రతత అని అన్నారు. ప్రమాదంలో మరణించి వర్కర్‌కి 10 లక్షలు చెల్లించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి ఐటి,సోషల్ మీడియా మంథని అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ తొట్ల రాజు,సీనియర్ నాయకులు శ్రీమల్ల తిరుములు,కుంట చక్రి,కందుల రమేష్,పరిశుద్ధ్య కార్మికుల మండల అధ్యక్షులు కన్నూరి రాంచేందర్,శ్రవణ్,సంపత్,మల్లక్క రజిత,శంకరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో బోనాల ఉత్సవాలు



ముత్తారం,జూలై 15 మనం న్యూస్ : మండల కేంద్రం ముత్తారంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం తెలంగాణ బోనాల ఉత్సావాలను ఉపాధ్యాయులు, విద్యార్థినీలు కలిసి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయ పద్ధతులు బోనాలు తయారుచేసి ఆటపాటలతో విద్యార్థులు ఉపాధ్యాయులు సందడి చేశారు. బోనాల సంస్కృతిక సంప్రదాయ పద్ధతులు బోనాలు తయారుచేసి ఆటపాటలతో విద్యార్థులు,ఉపాధ్యాయులు సందడి చేశారు. బోనాల సంస్కృతి ప్రత్యేకతను విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ఓ కమల,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం



రామగిరి,జూలై 15 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. పాఠశాలభివృద్ధి పై తల్లి దండ్రులతో కమిటీ నాయకులు,సభ్యులు చర్చించారు. మన ఊరు మన బడి కింద పాఠశాల రూపు రేఖలు మారిపోయాయని సర్పంచ్ పల్లెప్రతిమ పీవీరావు,ఎంపీటీసీ ధర్ముల రాజసంపత్ అన్నారు. పాఠశాలలో బోర్ మోటర్‌కు దాతలు ముందుకు రావాలనీ కమిటీ సభ్యులు కోరడం జరిగింది. పాఠశాలలో ప్రతి గదిలో ఒక గోడ గడియారం కావాలని కోరగా సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కొనుగోలు చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం వేగోలపు సదానందం గౌడ్,పాఠశాల కమిటీ సభ్యులు కెక్కర్ల మ్మోహన్,కలికోట రమేష్,మేకల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఐత్యమత్యంతో పోరాడితే ప్రతి కార్మికునికి సంకేమ పథకాలు అందుతాయి

**జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి**



రామగిరి,జూలై 15 మనం న్యూస్ : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండి రావలసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఐక్యమత్యంతో పోరాడితే ప్రతి కార్మికునికి సంక్షేమ పథకాలు అందుతాయి అన్నారు. రామగిరి మండలం సెంటినరీకాలనీలో శనివారం నాడు రామగిరి బిల్డింగ్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్ అసోసియేషన్ వారికి ఆ సంఘం గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరుస్వామి అందజేశారు. తద్వారా స్వామి మాట్లాడుతూ ప్రతి కార్మికుడు సంఘం బలోపేతం చేయుటకు తమ వంతు కృషి చేయాలి అన్నారు. ప్రతినెల సమావేశమై కార్మికుల కష్టసుఖాలు తెలుసుకుని తోటి కార్మికులకు చేయూతనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజనాల చంద్రమౌళి, నాయకులు ప్రదీప్,కిరణ్,రాజు,అజయ్,శ్రీను,రవి,మహేష్,సాగర్,తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘం ముసుగులో అక్రమాలు

## ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఓ ఉపాధ్యాయుడు

కోరుట్ల, జులై 15 (మనం న్యూస్): కంచె చేను మేసింది అన్న చందంగా ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేస్తూ ప్రభుత్వ ఆదాయానికే గండి కొడుతున్న ఓ ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్న బాగోతం ఇది. వివరాల్లోకి వెళితే కోరుట్ల మండలంలో జోగిన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చి అదేదో ఆదరబాదరాగా పని ఉందంటూ నిత్యం దుమ్మాకొడుతున్నట్లు తెలిసింది. ఓడి పేరుతో ఆరోగ్యంగా ఉన్నప్పటికీ ఇతర మెడికల్ లీవ్స్ పెట్టుకుంటూ తను చేసే తప్పుడు పనులు ఎక్కడ బయటపడతాయోనని దర్జాగా తన ఇంటినే కార్యాలయంగా మలుచుకొని ఉపాధ్యాయుల పెన్షనర్ల మెడికల్ బిల్స్, పెన్షన్ బిల్స్, ఇతర సర్వీస్ బిల్లులను చేసుకుంటూ అక్రమ సంపాదన సాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయుల, ఆఫీసుల పాఠశాలల వద్దకు వెళ్లి తాను ఓ పెద్ద సంఘంలో నాయకుడినని పేర్కొంటున్న సదరు ఉపాధ్యాయుడు దళారీగా అవతారమెత్తి ఈ పనులతోనే బిజీగా గడుపుతున్నాడని పలువురు పేర్కొంటున్నారు. ఏ బిల్లులైనా సరే ఎస్‌టిఓ, డీఈఓ ఆఫీస్ లోనైన తొందరగా పని చేయిస్తానంటూ పర్సెంటీజులు తీసుకుంటూ, విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయులు, పెన్షనర్లు నిజాయితీగా కట్టిన ఐటీ రిటర్న్స్ నుండి సైతం డబ్బులు తిరిగి ఇప్పిస్తానని పేర్కొంటూ 30 నుండి 40 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. పని వేళల్లో అక్రమ సంపాదన ధ్యేయంగా ఇలాంటి పనులు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్న తీరు ఉపాధ్యాయుల్లో పలు రకాల అనుమానాలకు దారితీస్తూ, పలువురిని అయోమయానికి గురిచేస్తుందనటం లో సందేహం లేదు. ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తూ సంఘంలో పెద్దమనిషి హోదా లో కొనసాగుతూ ఎంతోమందికి మార్గదర్శకంగా ఉండవలసిన ఉపాధ్యాయులు కూడా ఇలాంటి చట్ట వ్యతిరేక



కార్యకలాపాలకు పాల్పడుతుండడం వీరికి ఎవరెవరి అండ దండాలున్నాయో ఈ అక్రమార్గంలో ఎంతమందికి వాటాలు ఉన్నాయోనని అనేక విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉన్నత చదువులు చదివించలేని పేద కుటుంబాల విద్యార్థులకు విద్యా బోధన చేయకుండా ప్రభుత్వ సమయాన్ని తన వ్యక్తిగత, కుటుంబ, స్వార్ధ ప్రయోజనాల కోసం, అక్రమ సంపాదన కోసం వినియోగించడం ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇలాంటి చట్ట వ్యతిరేక ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెస్తున్న వారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## జర్నలిస్టుల రిలే దీక్షలకు బిజెపి మద్ధతు

### సంఘీభావం ప్రకటించిన బిజెపి జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి



జమ్మికుంట, జులై 15 (మనం న్యూస్): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హుజరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని స్థానిక గాంధీ చౌరస్తా వద్ద గత నాలుగు రోజులుగా జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శనివారం సందర్శించి జర్నలిస్టులకు భారతీయ జనతా పార్టీ తరపున మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభమైన మీడియాను గత తొమ్మిదేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో తనకబంద హస్తాలలో బంధించి నానా యాతనలకు గురిచేస్తూ జర్నలిస్టుల పట్ల నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్నారని తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా జర్నలిజాన్ని తమ జీవనోపాధిగా చేసుకుని యాజమాన్యాలు పెట్టే బాధలను సైతం తట్టుకొని ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ హితం కోసం పాటుపడే జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ తీరు సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా వారికి న్యాయమైన హక్కుగా స్థలాలను కేటాయించాలని ,జర్నలిస్టులకు నివాసయోగ్యమైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుపేదలకు ప్రధాని మోడీ ఆవాస్ యోజన కింది తెలంగాణ రాష్ట్రానికి రెండు లక్షల ఇళ్లు నిర్మించేందుకు నిధులు కేటాయించినప్పటికీ కెసిఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిధులను ముఖ్యమంత్రి కేసీఆర్ దొడ్డిదారిన వారి అనుచర గణానికి మళ్ళిస్తూ రాష్ట్రంలోని అర్హులైన పేదలకు ఇప్పటివరకు కొన్ని మాత్రమే డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించి, ఇప్పటివరకు ఎవరికి పంపిణీ చేయకుండా తాత్సారం చేస్తూ నయవంచన గురి చేస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర మొత్తం మీద గుప్పెడు మందిగా ఉన్న జర్నలిస్టులందరికీ ఉత్తర కుమార మాటలు కట్టిపెట్టి తక్షణమే ఇళ్ల స్థలాలను మంజూరు చేసి వారికి అందివ్వాలని ఆయన డిమాండ్ చేశారు .లేనియెడల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులు సాధించేవరకు వారి హక్కుల సాధన కోసం తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు ,ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆకుల రాజేందర్ ,బిజెపి పట్టణ అధ్యక్షుడు జీడిమల్లేష్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ ,సుధాకర్ ,కంకణాల రామారెడ్డి ,ఇటికాల స్వరూప ,కుల కాని రాజు ,నిరుపమా రాణి ,పల్లపు రవి ,అప్ప మధు యాదవ్ తోపాటు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ కుడుతాడి బాపూరావు , అధ్యక్షుడు నేదురు సమ్మయ్య ,ప్రధాన కార్యదర్శి చౌడమల్ల యోహాన్ ,పంతాటి రవీందర్ ,భూపతి సంతోష్ ,అరికెళ్ల భానుచందర్ ,వలిపి రెడ్డి శ్రీనివాస్ ,నీల నాగరాజు ,కాజా ఖాన్ ,తాళ్లపల్లి రాజా గౌడ్ ,యోబుషి సంపత్ ,యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## దేశం కోసం.. ధర్మం కోసం..

# ప్రభుత్వం పని చేస్తుంది

### తెలంగాణలో రానున్నది బిజెపి ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్ రెడ్డి



చిగురుమామిడి, జులై 15 (మనం న్యూస్): దేశం కోసం, న్యాయం కోసం, నవ సమాజ నిర్మాణం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిజెపికి ప్రజాదరణ అధికంగా పెరుగుతుందని రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల మద్ధతుతో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం చిగురుమామిడి మండలంలోని పాంబండ సమీపంలో కొలువైన శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం సమీపంలో నిర్వహించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులకు బిజెపి అండగా ఉంటుందని, విలేకరుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటుందని తెలిపారు. వార్తల సేకరణలో నిరంతరం శ్రమిస్తోన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం పది లక్షల రూపాయల బీమా చేయిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు అన్నివేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బిజెపి పక్షాన బరిలో నిలిచేందుకు తనతో పాటు మరో నలుగురు టికెట్లు ఆశిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని జెఎస్సార్ వెల్లడించారు. రాష్ట్రంలో బిజెపికి యువత ఫాలోయింగ్ ఉన్నదని ప్రజలు యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగరవేయటం ఖాయమని ధీమా వ్యక్త పరిచారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో బిజెపి మండల కార్యదర్శి పైడిపల్లి శ్రీనివాస్, జెఎస్ఆర్ టీం సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం స్వాధీనం



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 15 (మనం న్యూస్): అక్రమంగా తరలిస్తోన్న ఐదు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వాంకిడి చెక్ పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా సుమో వాహనంలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం కంటబడింది. ఈ సందర్భంగా సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాంకిడి పోలీస్ స్టేషన్ కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సిఐ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ సందీప్ కుమార్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది మధు,రమేష్, సంజీవ్, విజయ్ పాల్గొన్నారు.

## లేక్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కరీంనగర్ క్రైం, జులై 15 (మనం న్యూస్): లేక్ అవుట్ పోస్ట్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం దిగువ మానేరు జలాశయం వద్ద లూపిన్ డయాగ్నోస్టిక్ వారి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్శకులు, వాకర్స్, సమీప ప్రాంతాలకు చెందిన వంద మందికి ఉచితంగా మధుమేహం, రక్తపోటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. దీనిలో లూపిన్ డయాగ్నోస్టిక్ ఏరియా మేనేజర్ కడివేంది సతీష్, పల్ల నరేందర్, లేక్ అవుట్ పోస్ట్ ఆర్ఎస్ఐ అర్షం సురేష్, హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, కానిస్టేబుల్ ఎండి.గౌస్, హోమ్ గార్డ్స్ మునిందర్, చక్రపాణి, స్వచ్ఛ భారత్ కార్యనిర్వాహకులు రాంప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌తోనే మూఢనమ్మకాల నిర్మూలన

### భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్



చిగురుమామిడి, జులై 15 (మనం న్యూస్): సైన్స్ తోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ అన్నారు. చిగురుమామిడి మండల పరిధిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ లో ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం సైన్సు – మూఢనమ్మకాలు నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా దోపిడీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దయ్యాలు భూతాలు మంత్రాలు బూటకమన్నారు. విద్యార్థి దశలోని సేవ దృక్పథకం పెంపొందించుకొని ఉన్నత చదువులతో తల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతి పై కిరోసిన్ తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యాలయాల్లో ఘనంగా బోనాల వేడుకలు



రామడుగు, జులై 15 (మనం న్యూస్): రామడుగు మండల వ్యాప్తంగా పలు విద్యాలయాల్లో ఆషాఢ మాస బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థుల వేషధారణలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో ఆషాఢ మాస బోనాల పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే గోపాల్రావుపేట గ్రామంలోని అక్షర హైస్కూలు, శ్రీ ప్రగతి హైస్కూలు లో ముందస్తు బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షర హైస్కూల్ పాఠశాల నుండి డప్పు చప్పుళ్ళతో విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో ఊరేగింపుగా వెళ్లిన విద్యార్థులు ప్రధాన కూడలి వద్ద చేసిన నృత్యాలు అలరించాయి. పోతురాజు, అమ్మవారు, దేవతల, పులి వేషధారణలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పంజాల ప్రమీల, కరస్పాండెంట్ పంజాల జగన్మోహన్, అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునిందర్, ప్రధానోపాధ్యాయులు రాధ, కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకట్ నారాయణ, ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతిహై స్కూల్ ఐఐటి అకాడమీలో స్వాగతోత్సవ్ - 2023 వేడుకలు



జగిత్యాల ప్రతినిధి, జులై 15 (మనం న్యూస్): పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీలో ‘ స్వాగతోత్సవ్ - 2o23 పేరిట శనివారం వేడుకలు నిర్వహించి, పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు చేసిన రుబిక్ క్యూబ్, విద్యార్థి దశ లో జరిగే పరిణామాలపైన వేసిన నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. నూతన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనిక రావు, అజితా రావు, రజిత, సుమన్ రావు, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బిసిలను రాజకీయంగా వంచిస్తున్న ప్రధాన పార్టీలు

### ఆగస్టు 5న కరీంనగర్ నడిబొడ్డున బిసి రాజకీయ శంఖారావం

### బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్

కరీంనగర్ కలెక్టరేట్, జులై 15 (మనం న్యూస్): వెనుకబడిన వర్గాల ప్రజలను ప్రధాన పార్టీలు రాజకీయంగా వంచిస్తున్నాయని బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. బిసి రాజ్యాధికార సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కడారి ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బిసి ముఖ్య నాయకుల సమావేశానికి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల దృష్ట్యా బిసిలను వంచించేందుకు మరో సారి సిద్ధమయ్యాయన్నారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలున్న తెలంగాణలో 50 శాతం టికెట్లను బిసిలకు కేటాయించకుండా, ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిసిని ప్రకటించకుండా ఏవిధంగా బిసిల ఓట్లు అడుగుతారని ప్రధాన పార్టీలను ప్రశ్నించారు. బిసిల భాగస్వామ్యం లేకుండా ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రాలేని ప్రస్తుత పరిస్థితి ప్రధాన రాజకీయ పార్టీలకు భోదపడిందని అందుకే బీసీల భజన చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కేవలం వంద రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో బీసీలలో రాజకీయ చైతన్యాన్ని నింపడానికి జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి కమిటీలతో పాటు గ్రామస్థాయి కమిటీలను బూతు కమిటీలను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. బలమైన బిసి ఆధిపత్య స్థానాలనుండి బిసిలు మాత్రమే అసెంబ్లీలో అడుగు పెట్టే విధంగా తీవ్ర ప్రయత్నాలను చేస్తూ బీసీల ఓటు బ్యాంకును ఏకీకరణ చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. 60 శాతం జనాభా ఉన్న అసెంబ్లీ స్థానాలు తెలంగాణలో 72 ఉన్నాయని, అందులో కనీసం 60 స్థానాలకు అన్ని రాజకీయ పార్టీలు బిసి నాయకులకు అవకాశం ఇచ్చే విధంగా అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందే తీర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు.



ఆగస్టు 5వ తేదీన కరీంనగర్ నడిబొడ్డున రాజకీయ నాయకులతో బిసి శంఖారావాన్ని పూరించి బిసిల రాజకీయ ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి లచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి పొదిల సాయిబాబా, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ విఠలేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బండి మల్లయ్య యాదవ్, బుర్ర కుమార్ గౌడ్ , ఉత్తర తెలంగాణ అధికార ప్రతినిధి రాజశేఖర్ గౌడ్ ,కనపర్తి రమేష్ ,రాజు సత్యనారాయణ రావు,వీరబోయిన మల్లన్న యాదవ్ , జిల్లా ప్రచార కార్యదర్శి ,ప్రవీణ్ కుమార్ గడప సత్యనారాయణ జిల్లా ప్రచార కార్యదర్శి జంగ కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తమను ఆదుకోవాలని కోరుతూ సిఎంకు రైతుల పోస్టుకార్డులు

ఇల్లందకుంట, జులై 15 (మనం న్యూస్): అన్ని విధాలా నష్టపోతున్న తమను ఆదుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు గడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని గడ్డివాని పల్లి గ్రామానికి చెందిన రైతులు సిఎం కెసిఆర్‌కు శనివారం పోస్టు కార్డులను పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి ప్రకోపంతో నష్టపోతున్న ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, ఈ ఖరీఫ్ సీజన్ కు పెట్టుబడికి ఉపయోగ పడే విధంగా కొత్త రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం అధిక వర్షపాతం వలన దిగుబడి తగ్గిందని, ఆ తక్కువ దిగుబడిలో ఐకెపి సెంటర్లలో తాలు, తేమ పేరుతో క్వింటాలుకు పది కిలోల తరుగు తీసి రైతులను మరింత నష్టపరిచారన్నారు. పత్తి పంటకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేదనే నెపంతో అతి తక్కువ ధరలతో కొనుగోళ్లు జరిపారని వాపోయారు. ఇలా చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, బ్యాంకర్లు సైతం రుణాలివ్వడానికి వెనుకాడుతున్నారని పేర్కొన్నారు.



ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల కష్టాలను అర్థం చేసుకుని తక్షణమే రెండు లక్షల రూపాయల రుణమాఫీతో పాటు వచ్చే సీజన్‌లో సాగుచేయడానికి అనుగుణంగా రుణాలు అందించాలని ఆయన కోరారు.

# అర్బన్ బ్యాంక్‌ను మంత్రి సొంత జాగీరులా మార్చారు

### ఏడేళ్లు గడుస్తున్నా పాలకవర్గ ఎన్నికలు నిర్వహించరా?

### క్రిమినల్ కేసులున్నవారికి పదవులా..?

### జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గడ్డం విలాస్ రెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, జులై 15 (మనం న్యూస్): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకును మంత్రి గంగుల కమలాకర్ తన సొంత జాగీరులా మార్చి వేశారని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గడ్డం విలాస్ రెడ్డి ఆరోపించారు. దాదాపు ఏడు సంవత్సరాలుగా బ్యాంక్ పాలక వర్గానికి ఎన్నికలు జరపకుండా, పర్సన్ ఇన్చార్జ్ కమిటీని నియమించడాన్ని ఆయన తప్పుబట్టారు. శనివారం కరీంనగర్ ప్రెస్ భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని 2017లో జనార్దన్ అనే బ్యాంక్ సభ్యుడు బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నిర్వహణపై స్టే తీసుకురావడం జరిగిందన్నారు. స్టే వచ్చి ఏడు సంవత్సరాలు గడిచినప్పటికీ అధికారులు కోర్టు అడిగిన సమాచారం ఇవ్వకుండా, ఓటర్ లిస్టు సవరించకుండా అధికార పార్టీకి తొత్తులై పర్సన్ ఇంచార్జ్ కమిటీలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 20వేల మంది సభ్యులున్న అర్బన్ బ్యాంక్, కరీంనగర్, జగిత్యాల బ్రాంచీలతో నడుస్తున్నప్పటికీ జగిత్యాల సంబంధించి ఏ ఒక్క సభ్యుడికి పర్సన్ ఇన్చార్జి కమిటీలో చోటు కల్పించలేదన్నారు. మహిళా సభ్యురాలిని కూడా నియమించకపోవడం సహకార చట్టానికి, బ్యాంక్ బైలాకు విరుద్ధమన్నారు. మంత్రి గంగుల కమలాకర్ తన సామాజిక వర్గానికి చెందిన ఐదుగురిని డైరెక్టర్లుగా నియమించుకోవడం, ఒకే కుటుంబం నుండి ఇద్దరికి ఇందులో అవకాశం కల్పించడం ద్వారా సహకార బ్యాంకును తన గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని విలాస్‌రెడ్డి విమ



ర్శించారు. బ్యాంకుకు సంబంధించిన విషయంలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారికి కమిటీలో చోటు కల్పించడం అవినీతికి ఆజ్యం పోసినట్టేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్యాంక్ సీఈవో, డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్, రాష్ట్ర సహకార అధికారి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ పాత పాలకవర్గానికి సంబంధించిన ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారు బ్యాంకు లావాదేవీలు , ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడ్డారని రాష్ట్ర సహకారమంత్రికి నివేదిక సమర్పించినప్పటికీ, స్థానిక మంత్రి గంగుల కమలాకర్ ఒత్తిడితో వారికి పర్సన్ ఇంచార్జ్ కమిటీలో చోటు కల్పించారని చెప్పారు. అనైతికంగా, చట్ట విరుద్ధంగా నియమించిన ఈ కమిటీని వెంటనే రద్దు చేసి, ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికల జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు జరిపితే అధికార పార్టీకి గెలవదనే ఉద్దేశంతో మంత్రి గంగుల ఎన్నికలకు ముందుకు రావడం లేదన్నారు. సహకార చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ కమిటీని వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన చెప్పారు. బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికలు జరిపే వరకు వివిధ రూపాలలో పోరాటం చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దన్ను సింగ్, ముక్క భాస్కర్, బొబ్బిలి విక్టర్, సుంకరి గణపతి, నిహాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన యువకులు



శంకరపట్నం, జులై 15 (మనం న్యూస్ః శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన యువకులు సాయి కష్ణ, సాయి చరణ్, సాగర్, అజయ్ తేజ, సాయి కిరణ్ లు స్థానిక ఎంపిపిఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఉచితంగా ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్గునూర్‌లో ఎటిఎం చోరికి యత్నం



తిమ్మాపూర్, జులై15 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అలుగునూర్ లో ఏటీఎంలో చోరికి ప్ర యత్నం చేశారు. పోలీసుల కథనం మేరకు అలుగునూర్ లోని కోటక్ మ హీంద్రా బ్యాంక్ సమీపంలోని ఏటీఎం వద్దకు శుక్రవారం రాత్రి గుర్తు తెలి యని దుండగుడు వచ్చి చోరికి ప్రయ త్నం చేశాడు. చోరికి య త్నించి ఏటీ ఎంని ధ్వంసం చేసి విఫలమయ్యా డు. శనివారం ఉద యం బ్యాంక్ ఉ ద్యోగులు చూసి ఎల్ఎండి పోలీసులకు సమాచారం అందించారు. తిమ్మాపూర్ సిఐ ఇంద్రసేనా రెడ్డి, ఎల్ఎండి ఎస్సై ప్రమోద్ రెడ్డి, సిబ్బందితో కలిసి వెళ్లి క్లూస్ ద్వారా టీం వేలీ ముద్రలను సేకరించి, సీసీ ఫుటేజ్ లను పరిశీలించారు. బ్యాంక్ మేనేజర్ బండి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

# జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

### మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు

### జర్నలిస్టుల దీక్ష విరమింపజేసిన చైర్మన్

జమ్మికుంట, జులై 15 (మనం న్యూస్)ః ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వార ధిగా పనిచేసి అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేసే నిస్వార్థ సేవకుడు ఒక జర్నలిస్టు మాత్రమేనని అలాంటి జర్నలిస్టుల ను కంటికి రెప్పలా కాపాడు కుంటామని మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజెశ్వరరావు అన్నారు .గత నాలుగు రోజులుగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హుజరాబాద్ నియోజకవర్గం లోని జర్నలిస్టులు నివేషణ స్థలాల కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు యూనియన్ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి విరవింపజేశారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని అలాంటి జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతున్నారని ఇకముందు కూడా జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టిఆర్ఎస్ పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తుందని రాజేశ్వర రావు అన్నారు . జర్నలిస్టుల న్యాయమైన కోరికలైనా నివేశన స్థలాల గురించి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ,ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి లతో చర్చించి జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామని ,రెవెన్యూ అధికారులతో కూడా చర్చించి రోడ్ మ్యాప్ రూపొందించి జర్నలిస్టులకు ఎక్కడ నివేశన స్థలాలకు ఆమోదంగా ఉంటుందో చూసి పది రోజుల్లో వారి కోరికలను నెరవేరుస్తామని




హామీ ఇచ్చారు .తాను మున్సిపల్ చైర్మన్ గా కాకుండా జర్నలిస్టులకు సోదరునిగా ప్రభుత్వ దూతగా హామీ ఇస్తున్నానని ఆయన జర్నలిస్టు సంఘానికి తెలిపారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ కుడిదాడి బాపూరావు ,స్టేట్ కౌన్సిల్ మెంబర్లు పొంతటి రవీందర్ ,భూపతి సంతోష్ , హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు నేదురు సమ్మయ్య ,చౌడమల్ల యోహన్ ,సహాయ కార్యదర్శి వలిపి రెడ్డి శ్రీనివాస్,యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలి

### పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వెంకన్న

జమ్మికుంట, జులై 15 (మనం న్యూస్)ః జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో భూకబ్జాలకు పాల్పడిన నాయకులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు కసబోజుల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ సలీంపాషతో కలిసి వెంకన్న మాట్లాడుతూ జమ్మికుంట నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 629 లో మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వరరావుతో పాటు ఇంకో ముగ్గురు అక్రమంగా ఒక్కొక్కరు 10 గుంటల చొప్పున ఎకరం భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఆరోపించారు. వారు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జీవో 58, 59 నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా తమ పేర్ల మీద ఇంటి నెంబర్లను కేటాయించుకొని తహసిల్దార్ కార్యాలయంలో పట్టాలు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒక నిరుపేద కుటుంబానికి కనీసం 60 గజాల ఖాళీ స్థలం కావాలన్న ఎన్నో నిబంధనలతో ఇబ్బందులు పెడుతున్నా అధికారులు జమ్మి కుంట మున్సిపాలిటీ పాలకవర్గంలోని కొందరు ప్రజాప్రతినిధులకు అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఇదే కాకుండా కొత్తపల్లి, రామన్నపెల్లి గ్రామాల శివారులో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 431 లో కూడా పెద్ద ఎత్తున కొందరు ప్రజాప్రతినిధులు అధికారుల అండదండలతో భూకబ్జాలు చేశారని పేర్కొన్నారు.ఈవిషయం పై గత నాలుగు నెలల క్రితం జిల్లా కలెక్టర్ కి, ఆర్డీవో కి, స్థానిక జమ్మికుంట మండల తహశీల్దార్ కి ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరుపలేదన్నారు. భూకబ్జాల పై సమగ్ర విచారణ జరుపని యెడల జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బల్మూర్



వెంకట్ ఆదేశాల మేరకు ఈ నెల 17న జమ్మికుంట మున్సిపాలిటీ పాలక వర్గం కొలువు తీరిన నాటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ భూములు కబ్జాకు గురైన స్థలాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత్రికేయులు, నిరుపేద కుటుంబాల సమక్షంలో పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, చిన్నింటి నాగేంద్ర పందిళ్ళ శంకర్ చిలువేరి రాజమౌళి పోతుల శ్రీనివాస్ సింగిరెడ్డి రంజిత్ రెడ్డి చెంచల శ్రీనివాస్ గొట్టే ప్రభుదాస్ లోనికి అంజి గుర్రపు మురళి అకినపెల్లీ మహేందర్ బోనగిరి ప్రశాంత్ గుల్లీ సమ్మయ్య మహేశ ప్రణయ్ పంజాల మొగిళీ గౌడ్ అకినపెల్లీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు అసహనం ప్రభుత్వ ఆసుపత్రుల తీరును బహిర్గతం చేసింది

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగ శ్రావణి

జగిత్యాల ప్రతినిధి, జులై 15 (మనం న్యూస్): జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పట్ల మంత్రి హరీష్ రావు అసహనం వ్యక్తం చేయడం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును బహిర్గతం చేసిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగిత్యాల పర్యటన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు సమాచారం ఇవ్వకుండా నేరుగా హరీష్‌రావు ఆసుపత్రిని సందర్శించడం ఎమ్మెల్యే పైన మంత్రికి ఎంత నమ్మకం ఉందో అర్థం అవుతుందని విమర్శించారు. ప్రజల ప్రాణాలు అంటే డాక్టర్లకు, ఆ డాక్టర్లకు మద్దతిస్తోన్న ఎమ్మెల్యేకు లెక్కలేదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని కనీస మందులు కూడా అందుబాటులో లేవని మండిపడ్డారు. జగిత్యాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వస్తున్నారని తెలిసి కూడా డాక్టర్లు అందుబాటులో లేరంటే వారికి ప్రజల ప్రాణాలు అంటే ఎంత



విలువ ఉందో అర్థం అవుతుందని శ్రావణి వ్యాఖ్యానించారు. ఆరోగ్య శాఖామంత్రి గంటన్నర పాటు ఆసుపత్రి కలియతిరిగి సమస్యలను చూసి ఖంగుతిన్నారన్నారు. మీడియాతో మాట్లాడటానికి కూడా ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ఇష్టపడలేదంటే ఆసుపత్రి పరిస్థితి ఏంటో అందరికీ తెలిసిందని ఆరోపించారు. నిజంగానే ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు ఉండి డ్యూటీ డాక్టర్లు విధుల్లో ఉంటే హరీష్ రావు ఆనందంగా మీడియాతో మాట్లాడి వెళ్లేవారు కదా అంటూ ప్రశ్నించారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్‌కు ఉన్న సమాచారం స్థానిక ఎమ్మెల్యేకు ఎందుకు లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కు చెప్తే ఆయన స్థానిక డ్యూటీ డాక్టర్లకు సమాచారం చేరవేస్తారని వాస్తవ పరిస్థితులను ఆరోగ్య శాఖ మంత్రికి తెలియకుండా దాస్తారన్న అనుమానంతోనే ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదని శ్రావణి ఆరోపించారు. ఎన్నికలు వచ్చే ఈ మూడు నెలలైనా ప్రజారోగ్యం పైన ఒక డాక్టర్ గా సంజయ్ కుమార్ దృష్టి సారించాలని హితవుపలికారు.

# రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

## మంత్రి హరీష్ రావుకు

## రెండవ ఏఎన్ఏంల సంఘం నేతల వినతి

జగిత్యాల, జులై 15 ( మనం న్యూస్ ) : రెండవ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని, పనిబారం తగ్గించాలని రెండవ ఏఎన్ఏం ల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగాండ్ల మధురిమ,పడాల మమత రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావును కోరారు. శనివారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు జగిత్యాల పర్యటనకు వచ్చిన సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు గాండ్ల మధురిమ, మమత లు కలిసి రెగ్యులరైజ్ చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధురిమ, మమతలు మాట్లాడుతూ తమపై పడుతున్న పని భారం తగ్గించాలని, ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు జిల్లాలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖలో తీవ్రమైన పని ఒత్తిడి ఉందని, మాతా శిశు సంరక్షణ సేవలు, గర్భిణి స్త్రీల నమోదు మొదలు వారు ప్రసవించే వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వైద్య పరీక్షలు చేయించడం భారంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రసవం వరకు తోడుండడం, పిల్లలకు టీకాల కార్యక్రమం, గృహ సందర్శన సేవలు, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాలు, మలేరియా, డెంగ్యూ వంటి కీటక వ్యాధుల నిర్మూలన, కుష్టు వ్యాధి నివారణ, క్షయ వ్యాధి నివారణ కార్యక్రమముతో పాటు సీజనల్ వ్యాధుల చికిత్సలకు అన్నీ తామే చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో, అర్బన్ వార్డుల్లో ప్రజలకు దగ్గరగా ఉండి



ఇళ్లిళ్లు తిరిగి వారి బాగోగులు చూసే ఏకైక ప్రభుత్వ శాఖ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అంటూ అందులో గత 16 ఏళ్లుగా పనిచేస్తున్న మాగురించి ఎవరూ పట్టించుకోవడం లేదని, వెంటనే మమ్మల్ని రెగ్యులర్ చేయాలని కోరారు. చాలా మంది 2 వ ఏఎన్ఏం లు పదవీవిరమణకు దగ్గరగా ఉన్నారని, వారిని అందుబాటులో ఉన్న ఖాళీలలో సీనియరిటి, ఆర్ఓఆర్ ఆధారంగా ఎలాంటి వ్రాత పరీక్ష లేకుండా భర్తీ చేయాలని మంత్రి కి విజ్ఞప్తి చేశారు. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెగ్యులరైజ్ చేయాలని మధురిమ,మమత, శోభా, మేరీ, జయప్రద, శైలజ, పద్మ, జయసుధ, జ్యోతిలు మంత్రి హరీష్ రావుకు విజ్ఞప్తి చేశారు.

# షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 15 (మనం న్యూస్)ః జిల్లాలోని బాబాపూర్ గ్రామం మైనార్టీ స్కూల్ విద్యార్థులకు శనివారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీం ఇన్చార్జి సునీత మాట్లాడుతూ హింస, ఈవ్ టీజింగ్ , సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురి అయినట్లయితే షీ టీమ్ ను సంప్రదించాలని సూచించారు . సైబర్ క్రైమ్ కు గురి అయితే 1930 కాల్ చేయాలని, అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తులకు నెంబర్లు ఇవ్వకూడదని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేయాలని, షీ టీం ఆసిఫాబాద్ 87126 70564 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత, ఆసిఫాబాద్ షి టీం సభ్యులు శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులు సమస్యలతో సతమతమవుతున్నారు

### పార్కింగ్ స్థలం సరిపోక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు

### 'గడప గడపకు కాంగ్రెస్'లో సమస్యలు ఏకరువు

### సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి

కరీంనగర్, జులై 15 (మనం న్యూస్)ః ప్రధాన కూరగాయల మార్కెట్, అన్నపూర్ణ కాంప్లెక్స్ ఏరియాలో చిరువ్యాపారులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన కూరగాయల మార్కెట్,అన్నపూర్ణ కాంప్లెక్స్,మదీనా కాంప్లెక్స్ ఏరియాలో వ్యాపారులను ప్రజలను కలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు ముఖ్యంగా చిరువ్యాపారులు పలుసమస్యలు మాదృష్టికి తీసుకువచ్చారని ప్రధానంగా మురికి కాలువలు నిర్మాణం చేయక పోవడంవల్ల దోమలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని పార్కింగ్ స్థలం సరిపోవడం లేదని కార్లు ఎక్కడ పెట్టిరావల్నో అర్థం కావడం లేదని వాహనదారులు వాపోతున్నారని అన్నారు.పాలకులు



సమస్యలు గాలికి వదిలేసి కరీంనగర్ ను అభివృద్ధి చేశామని పదే పదే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ బాధ్యుడు దన్నసింగ్, నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ఎండి చాంద్,దండి రవీందర్,గడ్డం విలాస్ రెడ్డి,షబానా మహమ్మద్,ఊరడి లత,ముల్కల కవిత,అన్నే జ్యోతిరెడ్డి, శారద, చంద్రయ్య గౌడ్,జీడి రమేష్, ముక్క భాస్కర్,మామిడి సత్యనారాయణ రెడ్డి ,నెల్లి నరేష్,సలిమొద్దిన్,గంగుల దిలీప్,జాఫర్,నదీమ్,అష్రఫ్ ఖురేషి, మహమ్మద్ భారీ, గాదె శివరాం, సోహెల్, హనీఫ్,అజ్మత్,జిలకర రమేష్,శ్రీకర్, బషీర్, సిరాజోద్దీన్, కమల్, సుధీర్, ఇమ్రాన్,సయ్యద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా

# జనం కోసం స్వచ్ఛంద సేవా సంస్థ



వెల్గటూర్, జులై 15 (మనం న్యూస్): నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది జనం కోసం స్వచ్ఛంద సేవా సంస్థ. జనం కోసం స్వచ్ఛంధ సం స్థ ఆధ్వర్యంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారం తో ఎండపల్లి మం డలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన 43 మందికి ఉచితంగా ఐదు సంవత్సరాల వ్యవధితో లేబర్ కార్డులు అందించినట్లు సంస్థ చైర్మన్ లింగంపల్లి చందు తెలిపారు. ఈ సందర్భంగా మెటర్నిటీ గిఫ్ట్ కింద గ్రామానికి చెందిన చొప్పరి సుజాతకు మంజూరైన 30 వేల రూపాయల చెక్కును శనివారం అందజేశారు. ఇప్పటికే గ్రామంలో లేబర్ కార్డులు ద్వారా గ్రామస్తులకు లబ్ది చేకూరిందని ఈ సందర్భంగా మంత్రికి జనం కోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ లింగంపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

# కథ చెబుతారా..? ఊ..కొడతాం.. టిటిడి కథల పోటీకి అనూహ్య స్పందన

కోరుట్ల, జులై 15 (మనం న్యూస్)ః తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న 'కథ చెబుతారా? ఊ కొడతాం' అనే పేరుతో కథల పోటీలో భాగంగా జగిత్యాల జిల్లాస్థాయిలో కోరుట్ల పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్, కల్లూర్ రోడ్ లో శనివారం నిర్వహించిన కథలపోటీకి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా కన్వీనర్ మంచాల జగన్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లోని ప్రతిభ వెలికి తీయడమే కాకుండా మన సాంస్కృతి సాంప్రదాయాలు వారికి తెలిసేలా దోహదపడతాయని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో నెలకు ఒకసారైనా నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరిగి ఉన్నతంగా ఎదుగుతారని స్పష్టం చేశారు. ఈ కథ చెబుతారా? ఊ కొడతాం' కార్యక్రమానికి జిల్లాలోని మల్యాల, కొడిమ్యాల, జగిత్యాల, రాయికల్, మల్లాపూర్, కథలాపూర్ మండలాలలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులు పోటీలలో పాల్గొనగా ఒకటి నుండి ఐదవ తరగతి వరకు జూనియర్స్ విభాగము, 6 నుండి 10 వ తరగతి వరకు సీనియర్స్ విభాగంగా పోటీలు నిర్వహించగా సుమారు 300 మంది పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం ఆఫీసర్ రాంరెడ్డి క్రిష్ణమూర్తి, జగిత్యాల జిల్లా కన్వినర్ శ్రీ మంచాల జగన్ పర్యవేక్షణలో జడ్పీహెచ్ఎస్, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు




గడెల భూపతి, తెలుగు ఉపాధ్యాయులు కటుకోజ్వల మనోహరాచారి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా తెలుగు ఉపన్యాసకులు బట్టు హరిక్రిష్ణ, చింత మోహన్ ప్రసాద్, సుజాత, మోహనమ్మ లు వ్యవహరించారు. బాల బాలికలలో సృజనాత్మక ను, అద్భుతమైన ఆలోచనలను,అవగాహనను పెంపొందించడంలో కథలదే ప్రధాన పాత్రనీ, ఏడు చేపల కథ, నాన్న పులి కథ, ఒకనాటి బాల్యం గడిచేది కాదనీ, అదే లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ వారు విద్యార్థిని విద్యార్థులకు కథ చెబుతారా ? ఊ కొడతాం అనే అంశం మీద కథల పోటీలు నిర్వహిస్తున్నదనీ ఈ సందర్భంగా మంచాల జగన్ అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి వేయి రూపాయలు, రెండవ బహుమతి రూ 750 తృతీయ బహుమతి రూ 5 వందలు, కన్సొలేషన్ బహుమతి 2 వందలు నగదుతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన ప్రశంసాపత్రం కూడా బహూకరించామని మంచాల జగన్ పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొని బహుమతులు పొందిన విద్యార్థులు సీనియర్స్ ప్రథమ బీర్ణంది శ్రీవల్లి, 8జి క్లాస్, కథ ప్రహాద చరిత్ర, శ్రీ సరస్వతి శిశు మందిర్, కోరుట్ల, ద్వితీయ మణిజ్యోతి, కథ రామాయణం, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, కోరుట్ల. తృతీయ బి భవాని, కథ భగీరథ చరిత్ర, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, కోరుట్ల. కన్సొలేషన్ కొత్త సావర్ణి, కథ మహాభారతంలో అభిమన్యుడు, సరస్వతీ శిశుమందిర్, కోరుట్ల జూనియర్స్ విభాగం: ప్రథమ సహర్ష, 3వ తరగతి, శ్రీ సరస్వతీ శిశుమందిర్, కోరుట్ల. ద్వితీయ బహుమతి బి.హర్ష, 3వ తరగతి, శ్రీ సరస్వతి శిశుమందిర్, కోరుట్ల. తృతీయ జి విష్వక్సేన్, 3వ తరగతి, విస్ డం హైస్కూల్, రాయికల్, కన్సొలేషన్ వరునిక, 2 వ తరగతి, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, కోరుట్లలకు లభించింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు వినియోగించుకోవాలి

## మెరుగైన వైద్యసేవల కోసం అన్నిరకాల సదుపాయాలు

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు

జగిత్యాల ప్రతినిధి, జులై 15 (మనం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని రకాల సదుపాయలు అందుబాటులో ఉంచిన,ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అందులోని ప్రతి వార్డు తిరిగి అక్కడ ఉండే గర్భిణీలతో, వారి అటెండ ్తో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. ఎక్కడైనా లోపాలు ఉన్నాయా, మందులు సక్రమంగా అందుతున్నాయా, వైద్యం బాగుందా లేదా అన్న వివరాలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా లోపాలు ఉంటే దాన్ని సరిదిద్దుకుంటాం కాబట్టి మీరు ఇచ్చే సమాధానం నాకు ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఆస్పత్రులలో అన్ని రకాల మందులను అందిస్తుంది కాబట్టి ఎక్కడైనా సమన్వయ లోపం వల్ల మందులు సరైన సమయానికి పేషెంట్లకు అందుతున్నాయా లేవా అన్న వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు వారికి అవసరం ఉన్న అన్ని మందులను ఆసుపత్రి వారే సమకూర్చి ఇచ్చారని అన్ని రకాల పరీక్షలను ఆస్పత్రిలోనే చేశారని పేషెంట్లు సమాధానం ఇచ్చారు. తర్వాత పిల్లల ఇన్ పేషెంట్ వార్డుని సందర్శించిన మంత్రి అందులో అడ్మిట్ అయిన పిల్లలను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వమే అన్ని రకాల మందులతోపాటు టెస్టులను కూడా చేస్తుందని బయట





ప్రైవేటులో చేయించుకోవద్దని మంత్రి వారి తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం వైద్యుల హాజరు పట్టికను తనిఖీ చేసి సూపరింటెండెంట్, వైద్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్,హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెలా సతీష్ బాబు, జగిత్యాల జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావా వసంత, సూపరింటెండెంట్ రాములు ఉన్నారు. డాక్టర్లు విధులు నిర్వహించే తొమ్మిది నుండి నాలుగు గంటల సమయం వరకు విధుల్లో లేని డాక్టర్లపైన తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సూపరింటెండెంట్ రాములు లకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. అనధికారికంగా లీవులు పెట్టిన వారిని మందలించి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని రకాల వైద్య పరికరాలను, వైద్య సదుపాయాలను సమకూర్చిన నేపథ్యంలో వైద్యులు సమయానికి విధుల్లో ఉండి ప్రజలకు సేవలు అందించాలని మంత్రి తెలిపారు. అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోతే పేషెంట్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది కాబట్టి అలాంటి పరిస్థితి రాకుండా వైద్యులు సమన్వయంతో పని చేయాలని మంత్రి అన్నారు. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయవలసిందిగా మంత్రి కలెక్టర్ ను సూపరింటెండెంట్ ను ఆదేశించారు. స్వరాష్ట్రంలో సుపరిపాలన కోసం చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని అట్లా ఏర్పాటు చేసుకున్న అన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ముందుకెళ్తున్నారని అందులో భాగంగా జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్యం అందింజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉందని అందుకు అనుగుణంగా వైద్యులు అధికారులు పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి తెలిపారు. ఇప్పటికే అన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలకు సంబంధించి పరికరాలను, వైద్యులను, ప్రొఫెసర్లను, అసిస్టెంట్ ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించిందని మంత్రి హరీష్ రావు తెలిపారు.

# బచ్‌పన్ స్కూల్‌లో ఘనంగా ఆషాడ మాస బోనాలు

## ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు




జగిత్యాల, జులై 15 (మనం న్యూస్ ): పట్టణంలోని బచ్‌పన్ స్కూల్లో శనివారం ఆషాడ మాసం బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అమ్మవారికి విద్యార్థులు బోనాలు సమర్పించారు. బోనాల పండుగ సందర్భంగా బాల, బాలికల వేషాధారణలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్సీ రమణను పరామర్శించిన మంత్రులు



జగిత్యాల, జులై 15 (మనం న్యూస్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ .రమణ కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఇటీవల రమణ తండ్రి ఎల్.జి రాం మరణించిన నేపథ్యంలో రమణను జగిత్యాలలోని ఆయన నివాసంలో మంత్రులు తన్నీరు హరీశ్ రావు, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, దీకొండ దామోదర్ రావు, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, సుంకే రవిశంకర్, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్ధార్ రవీందర్ సింగ్‌లు కలిసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ జి రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

**మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజీపూర్, లక్షెటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,

**ఆసిఫాబాద్ జల్లా:** కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన. వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.

మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

**నిర్మల్ జల్లా:** నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

**ఆదిలాబాద్ జల్లా:** అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076